సాక్షి నంద్యాల

మంగళవారం । 12 । మార్చి । 2024



పత్తి క్వింటా రూ.8వేలు

ఆదోనిఅర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో పత్తి క్వింటా ధర రూ.8 వేలు పలికింది. సోమవారం 795 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకొచ్చారు.



అలరించిన భక్తిరంజని

శ్రీశైలంటెంపుల్: నిత్యకళావేదికపై సోమవారం వైఎస్సార్ జిల్లాకు చెందిన వై.జయకృష్ణ, కృష్ణా జిల్లాకు చెందిన గోదా నరసింహారావు బృందం భక్తి రంజని కార్యక్రమాలు అలరించాయి.



'కూలి'పోయిన బతుకులు

తుగ్గలి రైల్వేస్టేషన్ సమీపంలో ట్రాక్ పక్కన కంకర తీస్తుండగా రైలు ఢీకొనడంతో సోమవారం ఇద్దరు కూలీలు మృత్యువాత పడ్డారు. దీంతో వారి కుటుంబాల్లో విషాదం నెలకొంది. 8లో▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:31	ఉ॥ 5:04
ఆదోని	సా॥ 6:34	ఉ॥ 5:07
నంద్యాల	సా॥ 6:31	ఉ॥ 5:01
ఆత్మకూరు	సా॥ 6:29	ఉ॥ 5:02
బనగానపల్లె	సా॥ 6:32	ఉ॥ 5:02

హదీస్ వెలుగు :

పేదలకు విరివిగా దానధర్మాలు చేయండి. పవిత్ర రంజాన్ మాసంలో ఒక్క రూపాయి దానం చేస్తే సాధారణ రోజుల్లో డెబ్బై రూపాయలు చేసినంత పుణ్యం లభిస్తుంది. - పవిత్ర ఖురాన్

పేదల బతుకుల్లో చేయూత వెలుగులు

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి
- మహిళలను వ్యాపారవేత్తలుగా మారుస్తున్న వైనం
- వైఎస్సార్ చేయూత ద్వారా ఏటా రూ.18,750
- జిల్లాలో అర్హులకు నాలుగు విడతల్లో రూ. 698.91 కోట్లు జమ



గోవిందపల్లెలో అవగాహన కల్పిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి (ఫైల్)



వ్యాపారాన్ని వృద్ధి చేసుకుంటూ..

ఈమె పేరు సాయిబోయిన సుబ్బమ్మ. శిరివెళ్ల మండలం ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన ఈమె గతంలో వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ఈ క్రమంలో వైఎస్సార్ చేయూత పథకంలో మొదటి విడత రూ. 18,750 జమ కావడంతో ఆ మొత్తాన్ని బ్యాంక్ పెట్టుబడి నిధి కింద పెట్టుకుని రూ. 75 వేలు రుణం తీసుకుని చిరు వ్యాపారం మొదలు పెట్టింది. అంచెలంచలుగా వ్యాపారాన్ని పెంచుకుంటూ ఇప్పుడు టీ, కూల్ డ్రింక్, కొబ్బరి బొండాలు, సీజనల్ పండ్ల వ్యాపారం చేస్తోంది. ఇప్పుడు నాలుగో విడత వచ్చిన వైఎస్సార్ చేయూత నిధులతో మరో ఫ్రిజ్ కొనుగోలు చేసి పాలు, పెరుగు వ్యాపారం చేసుకుంటామని, మాలాంటి వారి కోసం ప్రతి సంవత్సరం డబ్బులు జమ చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పటికీ రుణ పడి ఉంటామన్నారు.

ఆళ్లగడ్డ: మహిళాసాధికారతే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాల ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తోంది. అణగారిన వర్గాల అతివలకు 'వైఎస్సార్ చేయూత' పథకం కింద ఆర్థిక సాయం అందిస్తూ అండగా నిలుస్తోంది. ఏటా లబ్ధిదారుల ఖాతాల్లో రూ.18,750 చొప్పున జమ చేస్తోంది. ఈ సహాయాన్ని పెట్టుబడిగా మార్చుకుని స్వశక్తితో వ్యాపారాలను వృద్ధి చేసుకుంటూ అక్కచెల్లెమ్మలు కుటుంబ పోషణలో భాగస్వాములవుతున్నారు. సరైన నాయకుడు అండగా నిలిస్తే అన్ని రంగాల్లో దూసుకెళతామని నిరూపిస్తున్నారు. ఈ క్రమంలోనే బడుగు బలహీన వర్గాల మహిళల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న వైఎస్సార్ చేయూతను అందిపుచ్చుకుంటున్నారు. చేయూతతో పాటు ఆసరా, సున్నావడ్డీ, స్త్రీ నిధి, జగన్న తోడు, ఉన్నతి తదితర పథకాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధిలో రాణిస్తూ సుస్థిర జీవనోపాధి వైపు అడుగులు వేస్తున్నారు. పలువురు దుకాణాలు, హోటళ్లు, టైలరింగ్, దుస్తుల వ్యాపారం, గొర్రెల పెంపకం, పాడి పరిశ్రమ వంటివి ఏర్పాటు చేసుకుంటూ చిరువ్యాపారాల్లో పెట్టుబడులు పెడుతూ తమతోపాటు నలుగురికి ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. 'వైఎస్సార్ చేయూత' పథకం అమలుతో బడుగు బలహీన వర్గాల మహిళల భవిత మారుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా 45 ఏళ్ల దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల మహిళలకు చేయూత ఆర్థిక భరోసా కల్పిస్తోంది. ఏటా క్రమం తప్పకుండా ఒక్కో మహిళ ఖాతాలో రూ.18,750 నగదు జమ చేసింది. ఇందులో భాగంగా ఇప్పటి వరకు జిల్లాలో నాలుగు విడతల్లో రూ. 698.91 కోట్ల లబ్ధి చేకూర్చింది.

ఒక్కో మహిళకు రూ. 75 వేలు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 45 - 60 సంవత్సరాల లోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన మహిళలకు నాలుగు దఫాలుగా ఏటా రూ. 18,750 చొప్పున మొత్తం రూ.75 వేల ఆర్థిక సాయం అందించాలన్నది వైఎస్ జగనన్న లక్ష్యం. ఆ మేరకు ప్రభుత్వం ప్రతి ఏడాది 45 ఏళ్లు నిండిన వారికందరికీ నూతనంగా ఈ పథకంలో అవకాశం కల్పిస్తూ చేయూత అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటూ నాలుగు దఫాలుగా అర్హుల ఖాతాల్లో నిధులు జమ చేసింది. ఈ నగదును నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేస్తూ లబ్ధిదారులు వారికి ఇష్టమైన రీతిలో వినియోగించుకునే అవకాశం కల్పించింది. ఇందులో భాగంగా వైఎస్సార్ చేయూత కింద మూడేళ్లలో జిల్లాలో 516.56 కోట్లు ఆర్థిక సహాయం అందించడం జరిగింది. నాలుగో విడతగా ఈనెల 5వ తేదీ 9,7254 మంది లబ్ధిదారులకు రూ 182.35 కోట్లు నిధులు విడుదల చేశారు.

నాలుగో విడత వైఎస్సార్ చేయూత నిధులు జమ నియోజకవర్గాల వారీగా ..

నియోజకవర్గం	ఎస్సీ	ఎస్టీ	బీసీ	మైనార్టీ	మొత్తం లబ్ధిదారులు	జమ అయిన మొత్తం
ఆళ్లగడ్డ	4,466	484	10,256	198	15,404	28,88,25,000
బనగానపల్లె	1,414	669	11,383	269	16,435	30,81,56,250
డోన్	2,987	452	11,428	299	15,166	28,43,62,500
నందికొట్కూరు	4,898	409	11,202	546	17,055	31,97,81,250
పాణ్యం	1,193	186	4,090	104	5,573	10,44,93,750
నంద్యాల	3,523	224	9,955	606	14,308	26,82,75,000
శ్రీశైలం	3,152	672	9,015	474	13,313	24,96,18,750
మొత్తం	21,623	3096	67,329	2,496	97,254	182,35,12,500

టీడీపీ హయాంలో ఇలా..

టీడీపీ హయాంలో మహిళా సంక్షేమానికి ఒక్క పథకం కూడా అమలు చేయలేదు. బ్యాంకులు లింకేజీ రుణాలు ఇవ్వడం తప్పితే మహిళా సంక్షేమానికి ప్రత్యేకంగా తీసుకున్న చర్యలు శూన్యమనే చెప్పవచ్చు. 2014 ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని నమ్మించి మోసం చేశారు. మళ్లీ ఎన్నికలు వస్తుండటంతో కొత్తకొత్త వాగ్దానాలతో ముందుకు వస్తున్నారు. చంద్రబాబు మాటలను మహిళలు నమ్మే స్థితిలో లేరు.

నంద్యాల జిల్లాలో నాలుగేళ్లలో వైఎస్సార్ చేయూత పథకం వివరాలు

సంవత్సరం	లబ్ధిదారులు	జమ చేసిన మొత్తం (రూ. కోట్లలో)
2020-21	87,164	163.43
2021-22	93,351	175.03
2022-23	94,989	178.10
2023-24	97,254	182.35



అప్పులు తీర్చి ఆదాయం పొందుతూ..

ఇక్కడ చిల్లర దుకాణంలో కూర్చున్న మహిళ పేరు షేక్ షహిదాబీ. ఆళ్లగడ్డ మండలం యాదవాడ గ్రామం. ఈమె గతంలో రోజు కూలి పనికి పోతే గాని ఇంట్లో జరగని పరిస్థితి. చిన్న వయస్సు నుంచి రోజు కూలీ పనిచేయడంతో 45 ఏళ్లకే అరోగ్య సమస్యలు వచ్చాయి. దీంతో కూలీ పనికి పోయే ఓపికలేక కొంత మేర అప్పు చేసి చిన్న బంకు ఏర్పాటు చేసుకుని కుటుంబాన్ని నెట్టు కొస్తూ ఉండేది. ఈ క్రమంలో ప్రభుత్వం అందజేస్తున్న చేయూత సాయంతో వ్యాపారాన్ని కొంత మేర పెంచుకుంది. చేయూత ద్వారా నాలుగేళ్లలో రూ. 75 వేలతో పాటు సున్నా వడ్డీ రూ. 24 వేలు, ఆసరా రూ.48,400 పొందింది. దీంతో బంకు స్థానంలో పకడ్బందీగా రేకుల షెడ్ వేసుకుని కిరాణ కొట్టుతో పాటు అందులో కూల్ డ్రింక్ వ్యాపారం మొదలు పెట్టింది. ఇప్పుడు ఎక్కడా అప్పు చేయడం లేదని గర్వంగా చెబుతోంది.

మెరుగుపడుతున్న జీవనోపాధి



అర్హులందరికీ 'వైస్సార్ చేయూత' పథకం నిధులు అందేలా పకడ్బందీ చర్యలు తీసుకున్నాం. ఈ మొత్తాన్ని సక్రమంగా వినియోగించుకునేలా క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మహిళలు వివిధ రకాల వ్యాపారాలు, చేతి వృత్తులు, మేకలు, గొర్రెలు, డెయిరీ, వ్యవసాయ, అనుబంధ పనులకు పెట్టుబడుల పెట్టుకునేందుకు చేయూత సొమ్ములు పెట్టుకుంటూ పథకాలను సద్వినియోగం చేసుకుంటుండటంతో జీవనోపాధి మెరుగుపడుతోంది.

– శ్రీధర్‌రెడ్డి – పీడీ, డీఆర్డీఏ నంద్యాల

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(అర్బన్): సఖీ-1 స్టాఫ్ సెంటర్ (మిషన్ శక్తి-సింబల్)లో ఖాళీ పోస్టుల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సాధికారత అధికారిణి నిర్మల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీల భర్తీకి ఈనెల 2వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేసి సంబంధిత సెంటర్ అడ్మినిస్ట్రేషన్ కేసు వర్కర్, పారా లీగల్ పర్సనల్, సైకో సోషల్ కౌన్సిలర్ తదితర పోస్టులకు అర్హత పరీక్షలు నిర్వహించామన్నారు. కాగా అభ్యర్థులెవరూ అర్హత సాధించకపోవడంతో ఆ నోటిఫికేషన్ రద్దు చేస్తూ అభ్యర్థుల నుంచి కొత్తగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. నోటిఫికేషన్, వయస్సు, విద్యార్హత వివరాలకు జిల్లా వెబ్‌సైట్ https://nandyal.ap.gov.in పరిశీలించాలన్నారు.

ఉర్దూ పాఠశాలల పని వేళల్లో మార్పు

నంద్యాల(న్యూటౌన్): పాఠశాల విద్యాకమిషనర్ ఆదేశాల మేరకు పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని అన్ని ప్రభుత్వ యాజమాన్యాల్లోని ఉర్దూ మీడియం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల, ఉర్దూ మీడియం ప్యారలల్ సెక్షన్లకు పని వేళల్లో మార్పులు చేసినట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12వ తేదీ నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పాఠశాలలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎంఈఓలను ఆదేశించారు.

ఆశాజనకంగా ఎండు మిర్చి ధరలు

నంద్యాల(సెంట్రల్): పట్టణంలోని మిర్చి యార్డులో ఎండుమిర్చి ధరలు ఆశాజనకంగా కొనసాగుతున్నాయి. సోమవారం సూపర్-10 రకం సరకు అమ్మకాలు జరిగాయి. సూపర్-10 రకం జనరల్ క్వింటాలు గరిష్ఠ ధర రూ.16,500, మధ్యస్థ ధర రూ.15,200, కనిష్ఠ ధర రూ.13,000గా నమోదైంది. ఇదే రకం తాలుకాయ జనరల్ గరిష్ఠ ధర క్వింటాలు రూ.7,500, మధ్యస్థ ధర రూ.7,000, కనిష్ఠ ధర రూ.5,500 గా పలికినట్లు యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి కల్పన ఓ ప్రకటనలో తెలిపారు. అన్నదాతలు దళారులను నమ్మి మోసపోకుండా యార్డులోని ధవీకత వ్యాపారస్తుల వద్ద సరకు అమ్ముకొని మంచి ధరను పొందాలని సూచించారు.

సహకార సంఘం జేఏసీ ఎన్నిక

నంద్యాల(న్యూటౌన్): ఉమ్మడి జిల్లాల సహకార సంఘం జేఏసీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు వీరభద్రుడు, సుబ్బారావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధ్యక్షుడిగా దస్తగిరి, ఉపాధ్యక్షుడిగా శివకృష్ణ, జనరల్ సెక్రటరీగా ఖాజా మొహిద్దీన్, జాయింట్ సెక్రటరీగా వేణుగోపాల్, ఉపాధ్యక్షులుగా జంబులయ్య, గోపాల్‌రెడ్డి, డివిజన్ సెక్రటరీగా శివరామిరెడ్డి, నరసింహ, హరీఫ్‌బాషా, కరీం బాషా, నరసింహుడులను ఉమ్మడి జిల్లాల జేఏసీ కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు దస్తగిరి మాట్లాడుతూ సహకార సంఘ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

కమనీయం పుష్పోత్సవం

- అశ్వవాహనంపై ఊరేగిన స్వామిఅమ్మవార్లు
- శ్రీగిరిలో ముగిసిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు



పుష్పోత్సవానికి పుష్పాలు, పండ్లు తీసుకొస్తున్న ఈఓ పెద్దిరాజు, వేద పండితులు



అశ్వ వాహనంపై విహరిస్తున్న భ్రామరీ సమేత మల్లికార్జునుడు

శ్రీశైలంటెంపుల్: ఇల కైలాసమైన శ్రీశైల మహా పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల చివరిరోజు సోమవారం శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అశ్వవాహనసేవ నిర్వహించారు. స్వామిఅమ్మవార్లకు పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవ నిర్వహించారు. మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభమైన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగిశాయి. ముందుగా అక్కమహాదేవి అలంకార మండపంలో శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు అశ్వవాహనసేవ నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన అశ్వవాహనంపై స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉంచి ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, వేదపండితులు పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఉత్సవం నిర్వహించారు. ఉత్సవంలో డప్పువాయిద్యాలు, జానపద కళాకారుల నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం స్వామిఅమ్మవార్లకు పుష్పోత్సవం జరిపారు. ఇందులో పలు రకాల సుగంధ పుష్పాలను వినియోగించారు. ఎర్రబంతి, పసుపుబంతి, చేమంతి, తెల్ల చేమంతి, మల్లెలు, కనకాంబరాలు, ఎర్రగన్నేరు, తెల్లగన్నేరు, ముద్దగన్నేరు, దేవగన్నేరు, సువర్ణగన్నేరు, నందివర్ధనం, మందార, ఎర్రఅస్టర్, నీలం అస్టర్, కాగడాలు, జబ్రా, కారినేషన్, అర్కిడ్స్, గ్లాడియోలస్ వంటి పుష్పాలతో స్వామివారికి సేవ చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు అద్దాల మండపంలో (శయమందిరం)లో శయనోత్సవం నిర్వహించి చివరిగా స్వామిఅమ్మవార్లకు ఏకాంత సేవ నిర్వహించారు. ఆయా పూజా కార్యక్రమాల్లో దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, ఏఈవో హరిదాసు, ఇతర ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

ఈ నెల 1వ తేదీ నుంచి ప్రారంభమైన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు 11రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగాయి. ప్రతిరోజు స్వామిఅమ్మవార్లకు వివిధ రకాల వాహనసేవలు నిర్వహించారు. ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు లక్షలాదిగా తరలివచ్చి స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు.

సీఎం పర్యటన విజయవంతం చేద్దాం

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



హెలిపాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ కే శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

బనగానపల్లె రూరల్: బనగానపల్లె పట్టణంలో ఈ నెల 14వ తేదీన జరిగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు, బూత్‌కన్వీనర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులతో పాటు వివిధశాఖల ఉద్యోగులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ.. బనగానపల్లె పట్టణంలో రూ.22 కోట్లతో వంద పడకల ఏరియా వైద్యశాల నిర్మాణం పూర్తయిందని, ఈ వైద్యశాలను ప్రారంభించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 14వ తేదీన బనగానపల్లెకు వస్తున్నారన్నారు. వైద్యశాల ప్రారంభోత్సవం అనంతరం స్థానిక ప్రభుత్వ క్రీడామైదానంలో భారీ బహిరంగసభ ఉంటుందన్నారు. ఈ సభకు ప్రజలు, పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పిలుపు ఇచ్చారు. నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు షేక్ బాబులాల్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నికల్లో ఎదుర్కోలేక టీడీపీ పలు పార్టీలతో పొత్తులు పెట్టుకుంటుందని విమర్శించారు. అద్దంకి సిద్ధం సభ తరహాలో బనగానపల్లె సభను కూడా విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షులు గుండం నాగేశ్వరరెడ్డి, ముస్లిం షేక్‌కార్పొరేషన్ డైరెక్టర్ అబ్దుల్ ఖైర్, డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, కోడూరు రామచంద్రారెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ జనార్థన్ రెడ్డి, రాష్ట్ర ముస్లిం మైనార్టీ ప్రధాన కార్యదర్శి అత్తార్ జాహెద్ తదితర పార్టీ ముఖ్యనాయకులు వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

బనగానపల్లె పట్టణంలో ఈ నెల 14న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ కే శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఏర్పాట్లను సోమవారం సాయంత్రం పరిశీలించారు. వారి వెంట స్థానిక ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి పలువురు జిల్లా ఉన్నతాధికారులు ఉన్నారు. ముందుగా సీఎం హెలిపాడ్ స్థలం, బహిరంగ సభ స్థలాన్ని, సీఎం ప్రారంభించే వంద పడకల ఏరియా వైద్యశాలను వారు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బహిరంగ సభకు వచ్చే ప్రజలకు ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బందోబస్తుకు వచ్చే పోలీసు అధికారులు, సిబ్బందికి వసతి సౌకర్యాలు కల్పించాల్సిన విషయంలో పలు సూచనలు చేశారు.



కోనేరులో మహానందీశ్వరుడి దంపతులకు తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

తెప్పోత్సవం.. రమణీయం

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీగంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరుడికి సోమవారం రాత్రి రుద్రగుండం కోనే రులో తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఏటా రథోత్సవం అనంతరం మరుసటి రోజు తెప్పోత్సవాన్ని వైభవంగా చేపడుతున్నారు. ముందుగా కోనేరులో అలంకరించిన తెప్పపైకి స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను చేర్చారు. అనంతరం మంగళవాయిద్యాలు, మేళతాళాల మధ్య తెప్పోత్సవాన్ని నిర్వహించారు.ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, వేదపండితులు రవిశంకర అవధాని, పండితులు, నంద్యాలకు చెందిన ఏజీఎస్ జ్యువెలర్స్ అధినేత అవ్వారు గోరీనాథ్, సరస్వతీ దంపతులు తదితరులు పాల్గొన్నారు.

కలహాలు.. కలవని నేతలు

- టీడీపీలో కొనసాగుతున్న వర్గ పోరు
- ఎడ మొహం, పెడ మొహంగా భూమా బ్రహ్మం, ఫరూఖ్
- ఇద్దరి తీరుతో క్యాడర్‌లో గందరగోళం



సాక్షి, నంద్యాల: తెలుగు దేశం పార్టీ అభ్యర్థుల ప్రకటనతో నంద్యాలలో భగ్గుమన్న విబేధాలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. పెద్ద బాబు, చిన్న బాబు ఇద్దరూ సర్దుకుపోవాలని సూచించినా మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి అలక వీడకపోవడంతో మాజీ మంత్రి ఫరూక్ వర్గంలో అయోమయం నెలకొంది. నంద్యాల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్‌గా మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి గతేడాది నవంబర్ వరకు ఉన్నారు. టికెట్ తనకే ఇస్తారన్న ఆశతో నాలుగున్నరేళ్ల పాటు పార్టీ కోసం తీవ్రంగా శ్రమించి, ఆర్థికంగానూ నష్టపోయారు. అయితే కనీస సమాచారం ఇవ్వకుండా ఆయన స్థానంలో మాజీ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కి ఇన్‌చార్జిగా టీడీపీ అధిష్టానం బాధ్యతలు అప్పగించింది. దీంతో అప్పటి నుంచి బ్రహ్మం వర్గం స్తబ్దుగా ఉంటోంది. కొత్త ఇన్‌చార్జ్‌గా నియమితులైన ఫరూక్‌కు కనీసం శుభాకాంక్షలు కూడా తెలపలేదు. అయినప్పటికీ చివరిలోపు టికెట్ తనకే వస్తుందన్న ధీమాలో భూమా బ్రహ్మం ఉంటూ వచ్చారు. వ్యక్తిగతంగా కార్యక్రమాలకు హాజరవుతూ తన వర్గాన్ని కాపాడుకుంటూ వస్తున్నారు. అయితే భూమా బ్రహ్మానికి షాక్ ఇస్తూ టీడీపీ నంద్యాల అభ్యర్థిగా ఫరూక్ పేరును టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించడంతో ఖరారు చేయడంతో భూమా వర్గం ఒక్కసారిగా కంగుతింది.

బాబు మాట బేఖాతర్..

నంద్యాల టికెట్ ఫరూక్‌కి ఇస్తున్నట్లు ప్రకటించడంతో భూమా బ్రహ్మం పది రోజుల నుంచి పార్టీ కార్యక్రమాలకు హాజరుకాలేదు. దీంతో మూడు రోజుల క్రితం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు ఫోన్ చేసి ఇద్దరు కలిసి పనిచేయాలని భూమా బ్రహ్మానికి సూచించారు. అయినా బ్రహ్మం అలక వీడలేదు. స్పష్టమైన హామీ ఏదీ ఇవ్వకపోవడంతో కలిసి పనిచేస్తానని చెప్పలేదు. దీంతో మాజీ మంత్రి నారా లోకేశ్ ఆదివారం ఫరూక్, భూమా బ్రహ్మాన్ని అనంతపురం పిలిపించుకుని మాట్లాడారు. అధికారంలోకి వస్తే తగిన పదవి ఇచ్చి గౌరవిస్తామని చెప్పారు. అయితే స్పష్టమైన హామీ ఇవ్వకపోవడతో బ్రహ్మం అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. లోకేశ్‌తో మాట్లాడిన అనంతరం ఎలాంటి ప్రకటన చేయకుండా నంద్యాలకు రాకుండా నేరుగా హైదరాబాద్‌కి వెళ్లిపోయారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో భూమా, ఫరూక్ ఎడమొహం, పెడ మొహంగా ఉండటంతో టీడీపీ కార్యకర్తలు గందరగోళానికి గురవుతున్నారు. పార్టీ ప్రకటించిన అభ్యర్థి వెంట నడవాలో లేక నాలుగున్నరేళ్ల పాటు తమకు అండగా ఉన్న నేత వెంట నడవాలో తెలియక డైలమాలో పడ్డారు.

క్లుప్తంగా

స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించండి

● జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా స్పందన కార్యక్రమంలో స్వీకరించిన వినతులకు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ పద్మజ తదితరులు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన సమస్యలను నాణ్యతతో పరిష్కరించడంతో పాటు ఏ ఒక్క దరఖాస్తు రీఓపెన్ కాకుండా చూసుకోవాలన్నారు. పరిష్కారం దొరకని సమస్యలకు సరైన కారణాలను ఎండార్స్ చేస్తూ అర్జీదారులకు అర్థమయ్యే రీతిలో వివరించాలన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో అధికారులకు అప్పగించిన విధులు నిర్వహించి ఉత్సవాలను విజయవంతం చేశారని, ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను అభినందించారు. ఇదే స్ఫూర్తితో ఈనెల 14 రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటన కూడా విజయవంతం చేయాలన్నారు. త్వరలో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్నందున అధికారులకు కేటాయించిన విధులు తు.చ తప్పకుండా పాటించి ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలన్నారు. స్పందనలో 111 వినతులు అందాయని, వాటిని సత్వరమే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

స్పందనలో కొన్ని వినతులు..

● పేద కుటుంబానికి చెందిన తనకు ఇల్లు లేదని, ఇంటి స్థలం మంజూరు చేయాలని కోరుతూ శిరివెళ్ల మండలం ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన షేక్ బాషా జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

● గ్రామంలో రీ సర్వే జరగలేదని తనకు సర్వే నెం.99లో 4.5 సెంట్లు, సర్వే నెం.299లో ఒక ఎకరా, సర్వే నెం.313లో 1.5 ఎకరాలు రీ సర్వే చేయించి న్యాయం చేయగలరని కోరుతూ గడివేముల మండలం గడిగరేవుల గ్రామానికి చెందిన పి.సుశీలమ్మ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

సాయుధ బలగాల కవాతు



కవాతు నిర్వహిస్తున్న సాయుధ బలగాలు

బొమ్మలసత్రం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు మనోధైర్యాన్ని కల్పించేందుకు పోలీసులతో కలిసి బీఎస్ఎఫ్ బలగాలు సోమవారం పట్టణంలో కవాతు నిర్వహించారు. జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి ఆదేశాల మేరకూ బీఎస్ఎఫ్ డీఎస్పీ అజయ్‌కుమార్, టూటౌన్ సీఐ రాజారెడ్డి, తాలూకా సీఐ దస్తగిరిబాబు బీఎస్ఎఫ్ సాయుధ బలగాలతో కవాతు చేపట్టారు. పట్టణంలోని నూనెపల్లి, పద్మావతినగర్, మున్సిపల్ ఆఫీస్, ఎన్‌జీవోస్ కాలనీ తదితర ప్రాంతాల్లో కవాతు నిర్వహించారు. అనంతరం సీఐ రాజారెడ్డి మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి అల్లర్లు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలకు భరోసా ఇచ్చేందుకు కవాతు నిర్వహించామన్నారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును స్వేచ్ఛగా శాంతిభద్రతల మధ్య వినియోగించుకునేలా చేయటమే పోలీసుల ధ్యేయమని వివరించారు.

కాలిన రోగులకు ఉపశమనం

- ప్లాస్టిక్ సర్జరీ విభాగానికి ఆధునిక హంగులు
- రూ.2.64కోట్లతో భవన నిర్మాణం
- పోస్టులన్నీ భర్తీ చేసిన రాష్ట్రప్రభుత్వం



నూతనంగా నిర్మించిన కాలిన రోగుల విభాగం

కర్నూలు(హాస్పిటల్): సాధారణంగా మన శరీరానికి ఏదైనా మంట తగిలితే బొబ్బలు వచ్చి అల్లాడిపోతాం. అలాంటి శరీరంలో 20 నుంచి 90 శాతం కాలిన గాయాలుంటే వారి పరిస్థితి ఎలాగుంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి వారికి చికిత్సతో పాటు ఉపశమనం కలిగించే వసతులు, సౌకర్యాలు కూడా వార్డులో ఉండాలి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నూతన భవన నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేసింది. ఇటీవలే ఈ భవనం రోగులకు అందుబాటులోకి వచ్చింది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ప్లాస్టిక్ సర్జరీ విభాగానికి ప్రతి సోమ, గురువారాల్లో ఓపీ సేవలు ఉంటాయి. ప్రతి ఓపీ రోజున 45 నుంచి 50 మంది, సగటున నెలకు 350 మంది చికిత్స నిమిత్తం రోగులు చికిత్స కోసం వస్తున్నారు. ఇలా వచ్చిన వారిలో అవసరమైన వారికి మంగళ, శుక్రవారాల్లో ఆపరేషన్లు నిర్వహిస్తారు. ఇలా ఏటా 500 నుంచి 700 వరకు శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. గతంలో ఈ విభాగానికి ఒక్కరే వైద్యులుండే వారు. ప్రస్తుతం ఒక ప్రొఫెసర్ డాక్టర్ మంజులబాయి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజారవికుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ స్వతంత్ర భారతి, డాక్టర్ విజయచంద్రమౌళి, డాక్టర్ సింధు ప్రియాంక ఉన్నారు. వీరితో పాటు పీజీ సీట్లు కూడా అందుబాటులోకి రావడంతో వైద్యసేవలు విస్తరించాయి. ముఖ్యంగా ఈ విభాగంలో గ్రహణమొర్రి, చిన్నారులకు పుట్టుకతో వచ్చే లోపాలు, రీ కన్స్ట్రక్టివ్ సర్జరీ (ప్రమాదాల్లో ఎముకలు విరిగిన తర్వాత అయ్యే గాయాలు), హ్యాండ్ సర్జరీలు(చేతిలో నరాలు, కండరాలు, ఎముకలు తెగిపోయిన సరిచేయడం), కాలిన గాయాలు, మచ్చలు, వైకల్యం, కాస్మోటిక్ సర్జరీలు(ముక్కు, బుగ్గలు, పెదాలు, కంటి రెప్పలు, చెవులపై ఉన్న లోపాలను తొలగించడం),ఫేస్‌లిఫ్ట్ సర్జరీ, స్థనాలు(బ్రెస్ట్) సర్జరీలు, పొట్టజారిపోయిన వారికి చేసే ఆపరేషన్లు, అధిక బరువును తగ్గించే లైపో సక్షన్ శస్త్రచికిత్సలు చేస్తున్నారు.

కాలిన గాయాలైన వారికి...

ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో కాలిన రోగులకు ప్రత్యేకంగా చికిత్స అందిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా వార్డు కూడా ఏర్పాటు చేశారు. ప్లాస్టిక్ సర్జరీ సేవలకు, కాలిన రోగులకు విడివిడిగా విభాగాలు ఆసుపత్రిలో ఉన్నాయి. నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ప్రీవెన్షన్ ఆఫ్ ది బర్న్ ఇన్‌జ్యూరీస్(ఎన్‌పీపీడీబీఐ) కింద కేంద్ర ప్రభుత్వం 2017 మార్చిలో రూ.6.7కోట్ల ప్రాజెక్టును మంజూరు చేసింది. ఇందులో రూ.2.64కోట్లను భవనం కోసం ఇచ్చింది. గత తెలుగుదేశం ప్రభుత్వం రెండేళ్లయినా పనులు ప్రారంభించలేదు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోగుల ఇబ్బందులను గుర్తించి భవన నిర్మాణానికి నిధులు కేటాయించింది. ఈ మేరకు ఏడాది క్రితం పనులు ప్రారంభమయ్యాయి. ఆసుపత్రిలోని లెప్రసి విభాగం పక్కన నూతన భవన నిర్మాణం ఇటీవలే పూర్తి కావడంతో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా దీనిని ప్రారంభించారు. త్వరలో ఈ భవనంలోకి ప్లాస్టిక్ సర్జరీ, కాలిన రోగుల విభాగం మార్పు చేసే అవకాశం ఉంది.

త్వరగా కోలుకునే అవకాశం



ఎన్‌పీపీడీబీఐ కింద కాలిన రోగుల కోసం నూతన భవన నిర్మాణం పూర్తయితే రోగులకు మరింత నాణ్యమైన వైద్యసేవలు అందే అవకాశం ఉంది. ఈ భవనంతో పాటు వసతులు, సౌకర్యాలు మెరుగవడంతో పాటు వైద్యులు, సిబ్బందిని నియమించనున్నారు. దీనివల్ల రోగి త్వరగా కోలుకునే అవకాశం ఉంది.

–డాక్టర్ మంజులబాయి, ప్లాస్టిక్ సర్జరీ హెచ్‌వోడీ, జీజీహెచ్, కర్నూలు

వైద్యులు, వసతులతో ఆధునిక భవనం

ఎన్‌పీపీడీబీఐ ప్రోగ్రామ్ కింద ప్రత్యేకంగా కాలిన రోగుల కోసం నూతన భవనం, మౌలిక సదుపాయాలు సమకూరుతున్నాయి. ఈ మేరకు భవనంలో రెండు వెంటిలేటర్లు, నాలుగు వైటల్ పారామీటర్ మానిటర్స్, డెర్మాటోమ్, రెండు స్కిన్ గ్రాఫ్ట్ మెషర్, రెండు పోర్టబుల్ లైట్స్, ఐదు హంబీస్ నైఫ్ మంజూరయ్యాయి. దీంతో పాటు 37 మంది వైద్యులు, సిబ్బంది పోస్టులు కూడా మంజూరయ్యాయి. ఇందులో ఒక ప్లాస్టిక్ సర్జన్/బర్న్స్/జనరల్ సర్జన్, ఇద్దరు అనెస్తెటిస్ట్స్, నలుగురు మెడికల్ ఆఫీసర్స్, 12 మంది స్టాఫ్‌నర్స్‌లు, ఒక ఓటీ టెక్నీషియన్, ఇద్దరు డ్రెస్సర్స్, ఇద్దరు మల్టీపర్పస్ రిహాబిటేషన్/సీబీఆర్ వర్కర్స్, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, 12 మంది మల్టీపర్పస్ వర్కర్స్(నర్సింగ్ ఆర్డర్లీ/నర్సింగ్ అటెండెంట్స్/సఫాయి కర్మాచారి)లు ఉన్నారు. తద్వారా రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందే అవకాశం ఉంది. ఈ ప్రక్రియ మొత్తం పూర్తయితే త్వరలో ఇది కాలిన రోగులకు రెఫరల్ సెంటర్‌గా మారనుంది.

వనిత డిపాజిట్ స్కీమ్ గడువు పొడిగింపు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ ఎస్వీ విజయమనోహరి

కర్నూలు(అగ్రికల్చర్): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇటీవల ప్రారంభించిన వనితా డిపాజిట్ స్కీమ్ గడువు పొడిగిస్తూ ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు బోర్డు నిర్ణయం తీసుకుంది. సోమవారం డీసీసీబీ చైర్ పర్సన్ ఎస్వీ విజయమనోహరి అధ్యక్షతన బోర్డు సమావేశం నిర్వహించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ వనిత డిపాజిట్ స్కీమ్‌కు అన్ని వర్గాల ప్రజల నుంచి ఆదరణ లభిస్తోందని, గడువు కూడా ఈ నెల 11తో ముగిసిన నేపథ్యంలో ఈ నెల చివరి వరకు పొడిగించాలని నిర్ణయించామన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ప్రొఫెషనల్ డైరెక్టర్‌గా డీసీసీబీ డిప్యూటీ జనరల్ మేనేజర్ నాగిరెడ్డి నియామకానికి బోర్డు ఆమోదం తెలిపిందన్నారు. పత్తికొండ, ఆదోని, ఆలూరు, కృష్ణానగర్, డోన్ బ్రాంచీల్లో పెండింగ్ బకాయిలు ఎక్కువగా ఉన్నాయని, వీటిని రాబట్టేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డైరెక్టర్లు గుండం సూర్యప్రకాశ్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, సీమ సుధాకర్‌రెడ్డి, మూలింటి రాఘవేంద్ర, డీసీసీబీ సీఈవో విజయకుమార్, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, ఆప్కాబ్ డిజిఎం అప్సర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మహానందీశ్వరుడి బ్రహ్మోత్సవాలు





పూర్ణాహుతి పూజలు నిర్వహిస్తున్న ఈఓ, పండితులు, రుద్రగుండం కోనేరులో త్రిశూల స్నానం చేస్తున్న దృశ్యం

మహానంది: మహానందిలో ఆరు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన మహానందీశ్వరుడి శివరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం పూర్ణాహుతితో ముగిశాయి. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, ఉపప్రధాన అర్చకులు వనిపెంట జనార్దనశర్మ, నాగేశ్వరశర్మ, తదితర రుత్వికుల బృందం ఆధ్వర్యంలో స్థానిక యాగశాలలో పూర్ణాహుతి పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. యాగఫల సమర్పణ, మహానందీశుడి దంపతులకు కంకణ, చండీశ్వరుడు, త్రిశూలుడికి త్రిశూల స్నానం పూజలను స్థానిక రుద్రగుండం కోనేరులో వైభవంగా చేపట్టారు. పెళ్లిపెద్దలైన శ్రీ పార్వతీ సమేత బ్రహ్మనందీశ్వరస్వామి వారి దంపతులతో పాటు మహానందీశ్వరుడి దంపతులను ప్రదక్షిణ గావించి తిరిగి అలంకార మండపానికి చేర్చారు.మహానందీశుడి బ్రహ్మోత్సవాల సందర్భంగా ధ్వజ పటాన్ని ఆరోహణ చేసిన విషయం తెలిసిందే. దీంతో ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆ పటాన్ని అవరోహణం చేశారు. అనంతరం స్థానిక అలంకార మండపం వద్ద నాకబలి పూజలు జరిపారు. పూజా కార్యక్రమాల్లో కల్యాణోత్సవ దాత లక్కబోయిన ప్రసాద్, ఏఈఓలు ఓంకారం వెంకటేశ్వరుడు, ఎర్రమల మధు, రిటైర్డ్ సూపరింటెండెంట్ కొండయ్య, కేశవరెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రంగన్న ,నాగభూషణం, అర్చకులు పాల్గొన్నారు.



మహానందిలో ధ్వజ అవరోహణ చేస్తున్న దృశ్యం

నేటి నుంచి యథావిధిగా ఆర్జితసేవలు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 6వ తేదీ నుంచి 11వ తేదీ వరకు నిలిచిన మహానందీశ్వరస్వామి ఆర్జిత సేవలు, గర్భాలయ ప్రవేశాన్ని మంగళవారం నుంచి యథావిధిగా కొనసాగుతాయని ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లకు ఆరు రోజుల పాటు ఆర్జితసేవలు నిలిపిన విషయం తెలిసిందే.

పట్టాలపై 'కూలి'పోయిన బతుకులు

- ట్రాక్ పక్కన కంకర తీస్తుండగా ఢీకొట్టిన డెమో రైలు
- ఇద్దరు కూలీల మృత్యువాత



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న గుంతకల్లు రైల్వే సీఐ బీవీ నగేష్‌బాబు



ఘటనా స్థలంలో రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

తుగ్గలి: వారిద్దరూ రెక్కల కష్టం చేసుకుని బతికే వారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న వారు. ట్రాక్ పక్కన కంకర తీస్తుండగా రైలు వచ్చి ఢీకొనడంతో మృత్యువాత పడ్డారు. దీంతో ఆయా కటుంబాల్లో విషాదం అలుముకుంది. ఈ దుర్ఘటన సోమవారం తుగ్గలి రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. మండల పరిధిలోని రాంపల్లికి చెందిన 15 మంది కూలీలు ఎప్పటిలాగే రైల్వే పనుల నిమిత్తం తుగ్గలికి వచ్చారు. స్టేషన్ సమీపంలో ట్రాక్ దిమ్మెలకు ఉన్న ఇనుప రింగులు కనబడేలా అక్కడక్కడ కొంత మంది కంకర తీసేపనిలో నిమగ్నమయ్యారు. గుజ్జుల కిష్టన్న(65), ఏకాశి ఓబులేసు(40), మరో కూలీ ఓచోట కంకర తొలగిస్తున్నారు. అదే సమయంలో డోన్ వైపు నుంచి గుంతకల్లు వైపు ఓ లైన్‌లో గూడ్స్‌రైలు వెళుతోంది. మరో వైపు గుంతకల్లు నుంచి డోన్ వైపు డెమో రైలు వస్తోంది. ఒకేసారి గూడ్స్ , డెమో రైళ్లు వచ్చాయి. ఈ సమయంలో హారన్ వినిపించినా కూలీలు పక్క ట్రాక్‌పై వెళుతున్న గూడ్స్ రైలు దని పొరపాటుపడ్డారు. పనిచేస్తుండగా కంకర దుమ్ము కూడా రేగడంతో కిష్టన్న, ఓబులేసు డెమో రైలు రాకను గమనించలేకపోయారు. ఇంతలోనే రైలు ఇద్దరిని ఢీకొనడంతో వారు అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. మరో కూలీ కొప్ప కాశీనాథ్‌కు తీవ్ర గ్రాయాలు కావడంతో చికిత్స నిమిత్తం పత్తికొండ ఆసుపత్రికి తరలించారు. పనిచేసేచోట కూలీలను అప్రమత్తం చేసేవారు కానీ, కనీస రక్షణ ప్రమాణాలు గాని పాటించకపోవడంతోనే దుర్ఘటన జరిగిందని మృతుల కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఘటన స్థలంలో మృతుల కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కిష్టన్నకు కుమార్తె, కుమారుడు, ఓబులేసుకు భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న గుంతకల్లు రైల్వే సీఐ బీవీ నగేష్‌బాబు, ఎస్ఐలు రాందాస్, వెంకటేశ్వర్లు, సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





మృతులు కిష్టన్న, ఓబులేసు (ఫైల్)

పదవీ కాలం పొడిగింపు

కర్నూలు కల్చరల్: ఎండోమెంట్ ట్రిబ్యునల్ చైర్మన్ కేవీఎల్ హరినాథ్ పదవీ కాలాన్ని మూడు సంవత్సరాలు పొడిగించారు. ఈ మేరకు దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ట్రిబ్యునల్ దేవదాయ శాఖకు సంబంధించిన ఆస్తులు, భూముల కేసులను విచారిస్తుంది.

ప్రాణం తీసిన అతివేగం

- స్కూటర్లు ఢీకొని యువకుడి మృతి
- ఇద్దరికి తీవ్రగాయాలు



మృతిచెందిన సిద్దీక్ ఆఫ్రిది

ఆలూరు రూరల్: అతివేగం ఒక యువకుడి ప్రాణం తీసింది. రెండు స్కూటర్లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మహమ్మద్ సిద్దీక్ ఆఫ్రిది (26) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఆలూరు మండలం మనేకుర్తి గ్రామం వద్ద 167 హైవేలో సోమవారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. కర్ణాటక రాష్ట్రం హోస్పేట పట్టణానికి చెందిన మహమ్మద్ సిద్దీక్ ఆఫ్రిది (26) స్కూటర్‌పై ఆదోనివైపువె వెళ్తున్నాడు. ఎమ్మిగనూరు మండలం రాళ్లదొడ్డి గ్రామానికి చెందిన మల్లికార్జున, షఫి అనే ఇద్దరు వ్యక్తులు స్కూటర్‌పై ఆలూరు వైపు వస్తున్నారు. మనేకుర్తి గ్రామం వద్ద అతివేగంగా రెండు స్కూటర్లు ఢీకొన్నాయి. ప్రమాదంలో సిద్దీక్ ఆఫ్రిది అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడ్డ మల్లికార్జున, షఫిలను అంబులెన్స్‌లో ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆస్పత్రికి రెఫర్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ చంద్రశేఖర్ విలేకరులకు తెలిపారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మహిళలకు చెక్కును అందజేస్తున్న పీడీ శ్రీధర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర ప్రభుత్వ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకొని సుస్థిరమైన జీవనోపాధిని సంపాదించుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని డీఆర్‌డీఏ సమావేశ భవనంలో లక్‌పతి దీదీ ఇంటరాక్షన్ కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్ విధానం ద్వారా ఢిల్లీ నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో బ్యాంకుల ద్వారా సీఐఎఫ్, శ్రీనిధి, ఉన్నతి పథకాల ద్వారా రుణాలు పొంది సుస్థిరమైన జీవనోపాధులు చేసుకుంటూ నెల రూ.10 వేలు పైబడి ఆదాయం సంపాదించే విధంగా మహిళలను లక్షలాధికారులను చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. జిల్లా నుంచి 100 మందిని లక్‌పతి దీదీలను గుర్తించడం జరిగిందన్నారు. జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షులు, కార్యదర్శి, కోశాధికారి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలతో పాటు 1,518 స్వయం సహాయక సంఘాలకు 114.91 కోట్ల మెగా చెక్కును అందజేశారు. మహిళలు జీవనోపాధిని ఏర్పాటు చేసుకొని ఇతరులకు ఆదర్శంగా నిలవాలని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ వంటి పథకాల ద్వారా లబ్ధి పొందాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ సురేష్, బ్యాంకు లింకేజీ కో ఆర్డినేటర్ ఎల్లయ్య, వైఎస్సార్ చేయూత జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనివాసులు, జిల్లా సమాఖ్య అధ్యక్షులు మార్తమ్మ, కార్యదర్శి సరస్వతి, కోశాధికారి అనురాధ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం 17వ నంద్యాల జిల్లా సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు.

ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు



మాట్లాడుతున్న జడ్జి వెంకటనాగ శ్రీనివాసరావు

కర్నూలు(లీగల్): లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ సిస్టమ్ ద్వారా ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు తెలిపారు. పంచలింగాల గ్రామంలో ఉన్న జిల్లా కారాగారాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ ఉన్న ఖైదీల వివరాలను సంబంధిత జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. వారికి అందించే భోజన సదుపాయాలను స్వయంగా పరిశీలించి, పర్యవేక్షణ అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఖైదీలతో మాట్లాడటానికి వచ్చే వారికి మాట్లాడే సదుపాయాన్ని పరిశీలించారు. అనంతరం ఖైదీల హాజరు పట్టికను పరిశీలించారు. ఖైదీలకు ఏదైనా సమస్య వస్తే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించాలని చెప్పారు. వంట గదులు, జైలు గదులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ ప్రజా ప్రయోజనాల సంస్థ అధ్యక్షుడు ఎం.వెంకట హరినాథ్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్ మనోహర్, జిల్లా సూపరింటెండెంట్ ఘనే నాయక్, జిల్లా ప్రొబేషన్ అధికారి వైఎల్ఎన్ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ డీఎంలో వర్క్‌షాపు



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న శాస్త్రవేత్త కిరణ్

కర్నూలు సిటీ: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇ న్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్(ట్రిపుల్‌ఐటీడీఎం)లోని మెకానికల్ విభా గం ఆధ్వర్యంలో సోమవారం రోబోల కోసం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై వర్క్‌షాపు ప్రా రంభమైంది. ఈ వర్క్‌షాపును డీఆర్‌డీఓ శాస్త్రవేత్త(పూణే) డాక్టర్ కిరణ్ ఆకెళ్ల, ట్రిపుల్‌ఐడీఎం డైరెక్టర్ డీవీఎల్ఎన్ సోమయాజులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ రోబోల తయారీలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ చక్కగా ఉపయోగపడుతుందన్నారు. ఏఐ విభాగంలో పరిశోధనలు చేసే వి ద్యార్థులకు వారం రోజుల పాటు జరిగే వర్క్ షాపు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు కా ర్యక్రమంలో వర్క్‌షాపు కో–ఆర్డినేటర్ డాక్టర్ రవికుమార్ మండవ తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిలకు జైలుశిక్ష

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో మద్యం సేవించి అసభ్యకరంగా ప్రవర్తించిన ఆకతాయిలకు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి జైలు శిక్షను ఖరారు చేసినట్లు సోమవారం పోలీసులు తెలిపారు. వివరాల మేరకు.. కర్నూలుకు చెందిన సురేష్ మద్యం సేవించి ఆర్టీసీ బస్టాండ్ వద్ద దారిన పోయే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వన్‌టౌన్ పోలీసులు ఆకతాయిలను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా రెండు రోజులు జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. మరో కేసులో పట్టణానికి చెందిన షేక్‌వాజిద్ జగజ్జననీ టర్నింగ్ ఏరియాలో దారిన పోయే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా రెండు రోజులు జైలుశిక్షను ఖరారు చేసినట్లు పోలీసులు తెలిపారు.